క్లుప్తంగా

పారదర్శకంగా ఉపాధి పనులు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ రత్నమాల, తదితరులు

పూసపాటిరేగ: ఉపాధిహామీ పనులు పారదర్శకంగా చేపట్టాలని ఏపీఓ రత్నమాల సూచించారు. మండలంలోని కుమిలిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేతనదారులు ఉదయం 7 గంటల నుంచి 11 వరకు.. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పనులు చేపట్టాలన్నారు. ఇచ్చిన కొలతల మేరకు పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. ఆమెతో పాటు ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

దుకాణాలకు తాళాలు



దుకాణానికి తాళం వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

విజయనగరం: దీర్ఘకాలంగా అద్దె బకాయి ఉన్న దుకాణాలకు రెవెన్యూ అధికారులు గురువారం తాళాలు వేసి సీజ్ చేశారు. గతంలోనే అద్దెలు చెల్లించని దుకాణదారులకు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు సిబ్బంది రెడ్ నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వారి నుంచి స్పందన రాకపోవడంతో 15 దుకాణాలను సీజ్ చేశారు. అద్దె చెల్లించని పక్షంలో అపరాధ రుసుంతో కలిపి వసూలు చేయాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

చురుగ్గా పూడికతీత పనులు



పూడికలు తీస్తున్న కార్మికులు

విజయనగరం: నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పలు డివిజన్ల పరిధిలో గురువారం పూడికలు తొలగించారు. మున్సిపల్ సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించారు.

ట్యాంక్ తొలగింపునకు నిర్ణయం



ట్యాంక్ తొలగింపుపై సమీక్షిస్తున్న అధికారులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరుకున్న రక్షిత మంచినీటి పథకం తొలగింపునకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం. రాధిక ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వరరావు, కార్యదర్శి రాంబాబు, సర్పంచ్ టి. సీతారాం సమక్షంలో సమావేశం నిర్వహించారు. ట్యాంక్ అడుగు భాగం దెబ్బతినడంతో, పిల్లర్లు ఎప్పుడైనా కూలే అవకాశం ఉండడంతో ట్యాంక్‌ను తొలగించడమే మంచిదని అభిప్రాయపడ్డారు. అలాగే ట్యాంక్ తొలగించిన తర్వాత ప్రజలకు తాగునీరు ఏవిధంగా సరఫరా చేయాలన్నదానిపై సమాలోచనలు చేశారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి..

• ఏసీడీపీఓ తవిటినాయుడు



సమావేశంలోమాట్లాడుతున్న తవిటినాయుడు

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఏసీడీపీఓ బి. తవిటినాయుడు అన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో స్కూల్ టీచర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలకు కిశోర వికాసంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదేశించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాల్లోపు వివాహాలు చేయకూడదన్నారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి. విజయలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ ప్రతినిధి మీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎర్రయ్యమ్మ, మేరీ వనిత, అనురాధ, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



అయ్యకోనేరు ముఖ ద్వారం

అయ్యో కోనేరు అధ్వానం..

విజయనగరం జిల్లా కేంద్రంలో గల అయ్యకోనేరు అధ్వానంగా తయారైంది. ప్రజల్లో చిత్తశుద్ధి లోపించడంతో పాటు అధికారుల పర్యవేక్షణ కరువవడంతో కోనేరు తన రూపునే కోల్పోయింది. కోనేరులో వ్యర్థాలు వేయరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ఫలితం లేదు. స్థానికులందరూ చెత్తాచెదారాలతో పాటు ఇళ్లల్లోని వ్యర్థాలను సైతం కోనేరులో పడేస్తున్నారు. దీంతో చెరువులో నాచు పెరిగిపోయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



కోనేరులో పేరుకుపోయిన నాచు



విరిగిన డోర్



పరిసర ప్రాంతాల్లో చెరువులో వ్యర్థాలు



వ్యర్థాలు వేయరాదంటూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రైతులకు అందుబాటులో ఉండాలి



సీతారామునిపేటలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

• జిల్లా వ్యవసాయాధికారి రామారావు

నెల్లిమర్ల రూరల్: క్షేత్ర స్థాయిలో రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు సూచించారు. మండలంలోని సీతారామునిపేట, సతివాడ రైతు సేవా కేంద్రాల పరిధిలో వరి పంట నమోదు, జియో ఫెన్సింగ్ విధానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో సాగు చేస్తున్న రైతులు తమ పంటల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. మొక్కజొన్న, వరి పంటల్లో సస్యరక్షణ పద్ధతులను రైతులకు వివరించాలని సూచించారు. ఏఓ పూర్ణిమ మాట్లాడుతూ.. మండలంలోని 2,575 ఎకరాల్లో ఈ పంట నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు నాగరాజు, శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మహలక్ష్మినాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

పూసపాటిరేగ: మండలంలోని కనిమెల్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకుల మహలక్ష్మినాయుడును నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, సర్పంచ్ నడిపేన రమణ, తదితరులున్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

నెల్లిమర్ల: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యు. మాణిక్యంనాయుడు తెలిపారు. నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం డీఈఓ ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్ నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఆ సమయానికి సగం మంది విద్యార్థులు మాత్రమే హాజరవడాన్ని గమనించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులంతా సమయానికి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని హెచ్ఎం ఆనందమూర్తిని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని బాబామెట్ట సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ అశోక్‌నగర్ ఫీడర్ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి. త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డబుల్ కాలనీ, దర్గా ఏరియా, కేంద్రియ విద్యాలయం ఏరియా, ఏడు కోవెళ్ల ఏరియా, బాబామెట్ట మిడిల్ పిచ్ ఏరియాలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలి

వేపాడ: చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని ఎంఈవోలు నాగభూషణం, బాలభాస్కరరావు సూచించారు. మండలంలోని శింగరాయి, జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలలను వారు గురువారం సందర్శించారు. తొలుత తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లిన వారు పుస్తకాలు చదివించి, వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటకాలు చేసి పెట్టాలన్నారు.

దేశ ఆర్థిక విజ్ఞానం కీలకం



అతిథులను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: దేశ ఆర్థిక పరిస్థితి తెలిపే విజ్ఞానం విద్యార్థి అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందని పలువురు చార్టెడ్ అకౌంటెంట్లు అభిప్రాయపడ్డారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఎ క్రిటికల్ ఎనాలసిస్ ఆఫ్ యూనియన్ బడ్జెట్ 2025' అనే అంశంపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో చార్టెడ్ అకౌంటెంట్లు ఎం.రామారావు, జి.మారుతీరాజ్ మాట్లాడుతూ.. బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన, విశ్లేషణ చాలా అవసరమన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ముఖ్య వక్తలను ఘనంగా సత్కరించారు. డిపార్టమెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్ఓడీ డాక్టర్ ఎస్.వరూధిని, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్ కీలకం..

దేశ అభివృద్ధికి యూనియన్ బడ్జెట్ కీలకంగా నిలుస్తుందని పలువురు ముఖ్య వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక మహరాజా అటానమస్ కళాశాలలో 'కేంద్ర బడ్జెట్ 2025-26' అంశంపై జరిగిన సదస్సులో రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ ఎ.వెంకటపతిరాజు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పీజీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ.. దేశ పాలనలో బడ్జెట్ ప్రాధాన్యతను వివరించారు. ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు కన్వీనర్‌గా డి.సన్యాసిరావు వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పీజీవీఎల్ నరసింహారావు

లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలి

• జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

బొండపల్లి: లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ సూచించారు. ఈ మేరకు బొండపల్లి మండలంలోని బోడసింగిపేట గ్రామంలో గల శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గొడౌన్‌తో పాటు, కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం దీపం పథకం ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఎంత మంది లబ్ధిదారులకు ఇచ్చారు? దీపం కనెక్షన్ ఉన్న వారంతా ఉచిత గ్యాస్‌ను పొందుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు? వారందరికీ గ్యాస్ సబ్సిడీ వారి అకౌంట్లలో పడుతుందా? అని నేరుగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని పరిశీలించారు. లబ్ధిదారులకు ఏ విధంగా సరుకులు పంపిణీ చేస్తున్నారో తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దోలా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బోడసింగిపేటలోని గ్యాస్ ఏజెన్సీలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్

రోడ్డు మధ్యలో కాలువ..



విజయనగరం మండలంలోని దుప్పాడ గ్రామంలో రామాలయానికి ఆనుకుని ఉన్న రహదారి మధ్యలో కాలువ ఉండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పటికప్పుడు వాహనాలు కాలువలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. కొద్ది రోజుల కిందట ఓ కారు ఆ రోడ్డుమీదుగా వెళ్తుండగా.. టైర్లు కాలువలో పడడంతో అందులో ఉన్న వారు చాలా ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి కాలువను రోడ్డు చివర ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– విజయనగరం రూరల్

వార్షిక బ్రహ్మోత్సవాలు..



విజయనగరం మండలంలోని దుప్పాడ గ్రామంలో ఉన్న శ్రీక్షేత్రంలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని ఆలయ ధర్మకర్త బాలాజీ తెలిపారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చేయాల్సిన ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– విజయనగరం రూరల్

డైరీ ఆవిష్కరణ



నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆవిష్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ఆకర్షణీయమైన డైరీని రూపొందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ఏఓ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

ఎంపీజీ సేవలు ఎనలేనివి

విజయనగరం టౌన్: శిష్టకరణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు ఉత్తరాంధ్ర పరిధిలోని నిరుపేద శిష్టకరణ కుటుంబాలకు అందిస్తున్న సేవలు ఎనలేనివని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు కొనియాడారు. గురువారం స్థానిక బృందావనం అపార్ట్‌మెంట్‌లో ఎంపీజీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. సుధారాణి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఎంపీజీ ఎంతగానో సేవలందిస్తున్నారన్నారు. అదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సింహగిరి పట్నాయక్, కృష్ణ, తిరుపతిరావు, త్రినాథ్ ప్రసాద్, ధనుంజయ్, ఉపేంద్ర, శిరీషా, ఈశ్వరరావు, ఉమ, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపీజీ ఈశ్వరరావు

వేసిన నెల రోజులకే బీటలు

• చోద్యం చూస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది. వేసిన నెల రోజులకే రోడ్లు, కాలువలు బీటలు దేరుతున్నాయి. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు స్థానిక టీడీపీ నాయకుల జేబులు నింపుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పినవేమలి గ్రామంలో ఇటీవల 13,08,830 రూపాయలతో 455 మీటర్ల పొడవున సీసీ రోడ్డు వేశారు. అయితే రోడ్డు వేసిన నెల రోజుల్లోగానే బీటలు దేరాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారి నిర్మాణంపై పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదులు అందినా తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికే సంబంధిత కాంట్రాక్టర్, టీడీపీ నాయకుడుకు రూ. 12 లక్షలకు పైగా బిల్లులు కూడా చెల్లించేశారు. ఈ విషయమై పీఆర్ జేఈ శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా రహదారి నిర్మాణంలో ఎటువంటి డొల్లతనం లేదని, నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మాణం చేపట్టడం జరిగిందని స్పష్టం చేశారు.



బీటలు వారిన పినవేమలి సీసీ రోడ్డు